

1,44,222 మంది రైతుల ఖాతాల్లో

నేడు అన్నదాత సుఖీభవ నిధుల జమ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని1,44,222 మంది రైతుల ఖాతాల్లో ఈనెల 19న అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం కింద నిధులు జమ కానున్నాయని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. అరకువాలీ నియోజక వర్గంలో రూ. 38.95 కోట్లు, పాడేరు నియోజకవర్గంలో రూ. 33.94 కోట్లు, రంపచోడవరం నియోజక వర్గంలో 28.23 కోట్లు, వెరసి మొత్తం జిల్లా వ్యాప్తంగా 1,44,222 మంది రైతులకు రూ.101.14 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయన్నారు.

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండో విడత అన్నదాత సుఖీభవ కింద రూ.ఐదు వేలు, కేంద్రప్రభుత్వం, 21వ విడత పిఎం కిసాన్ కింద రూ.రెండు వేలు నిధులు జమ చేయనుందన్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు కాఫీహౌస్‌లో జరిగే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని నిధులు విడుదల చేస్తారని కలెక్టర్ తెలిపారు.

ఎమ్‌డి హామీతో సమ్మె తాత్కాలిక విరమణ

- విధుల్లో చేరిన కాఫీ కార్మికులు
- 30లోగా చర్చలు జరపకుంటే మళ్లీ పోరాటం

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ ఎమ్‌డి నుంచి హామీ రావడంతో 12 రోజులుగా కొనసాగుతున్న కాఫీ కార్మికులు, హెల్పర్ల సమ్మె సోమవారం విరమించారు. మంగళగిరిలో జరిగిన సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వైఎస్.శ్రీధర్ ఇచ్చిన హామీ నేపథ్యంలో పనుల్లోకి తిరిగి చేరుతున్నట్టు సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రకటించారు. చింతపల్లి మండలం వంగసార తోటలో కార్మికుల సమావేశంలో చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీలోపు ఎమ్‌డి చింతపల్లి డివిజనల్ కార్యాలయానికి వచ్చి కాఫీ కార్మికులతో నేరుగా చర్చలు జరపాలని కోరామని, ఆ సమయానికి రాని పక్షంలో మళ్లీ సమ్మె తప్పదని స్పష్టం చేశారు.

17వ తేదీన సిఐటియు ప్రతినిధుల బృందం రాష్ట్ర రాజధాని అమరావతిలో ఎమ్‌డి డాక్టర్ శ్రీధర్‌ను కలిసి కార్మికుల సమస్యలు, 10 కోర్కెలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసింది. 12 రోజులుగా జరుగుతున్న సమ్మె విషయమై తమకు సమాచారం అందలేదని ఎమ్‌డి చెప్పారు. యూనియన్ ప్రతినిధులు నవంబర్ 6న ఇచ్చిన సమ్మె నోటీసు, గత అగ్రిమెంట్ అమలు కాకపోవడం, ప్రత్యర్థి సంఘంతో చేసిన ఒప్పందాల గురించి వివరించారు. రోజు కూలి రూ.500 కంటే తక్కువ కాకుండా నిర్ధారించాలని,



అమరావతిలో కాఫీ ఎమ్‌డికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు


కాఫీ పండ్ల సేకరణ రేట్లను పెంచాలని, తోటల సంరక్షణ కోసం అవసరమైన సిబ్బందిని తిరిగి నియమించాలని తదితర డిమాండ్లను పరిశీలిస్తామని ఎమ్‌డి హామీ ఇచ్చారు. గ్రూపు ఇన్సూరెన్స్ పరిధిలో ప్రమాద మరణ పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. పర్మినెంట్ కార్మికుల క్వార్టర్ల మరమ్మతులకు త్వరలోనే బడ్జెట్ విడుదల చేస్తామని చెప్పారు. అమరావతిలో జరిగిన చర్చల్లో లింగేరి సుందర్‌రావు, మోరి వెంకటగిరి, వెంకటేష్, కనకవల్లి, కాంతమ్మ, నాయుడు, కాంతారావు, బాలకృష్ణ, పాపారావు, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహార ఘటనలపై విచారణ

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్
- గిరిజన ఆశ్రమాలపై కొరవడిన నిఘా
- గుట్టుచప్పుడు కాకుండా అక్రమాలు
- విద్యార్థి సంఘాలకు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి- పాడేరు : పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతకు కారణమవుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారావు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆశ్రమాల్లో వరుసగా జరుగుతున్న ఈ ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు..

కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలోనే ఇంకా కోరుకుంటున్నారన్నారు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆశ్రమాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు.. ఆశ్రమాల్లో గుట్టు చప్పుడు కాకుండా అక్రమాలు సాగిపోతున్నాయని ఆరోపించారు. అవి బయటకు పడకుండా ఉండేందుకు విద్యార్థి సంఘాల నాయకుల్ని ఆశ్రమాల్లోకి అనుమతించడం లేదని, ఆశ్రమాల్లో విద్యార్థులు అవస్థలను తెలియనివ్వడం లేదని ఆరోపించారు.



గిరిజన సంక్షేమ డిడికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ ఐ నేతలు

ఆశ్రమ గురుకులం పాఠశాలలో నాణ్యమైన ఆహారం, సురక్షిత మంచినీరు, నాణ్యమైన విద్య వైద్య సదుపాయాలు అందని ద్రాక్ష గానే ఉన్నాయన్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేకపోవడం, విద్యార్థుల సంఖ్యకు సరిపడా వర్కర్‌స లేకపోవడంతో హాస్టళ్లలో ముఖ్యంగా వంట, భోజన గదుల్లో పరిశుభ్రత కొరవడి, ఈగలు, దోమలకు ఆవాసంగా మారిపోయాయని మండిపడ్డారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ సర్వేలో గుర్తించిన 80 హాస్టల్స్ లో మెనూ అమలు కాకపోవడం, ఇతర సమస్యలపై అధికారులకు నివేదించినా ఎటువంటి చర్యల్లేకపోవడం దుర్మార్గమన్నారు. మండల స్థాయిలోని ఎటిడబ్ల్యుఒలు వసతిగృహాలను తరచూ పర్యటించి, విద్యార్థుల ఆరోగ్యం విద్యాబోధన, పారిశుధ్యం ఇతర పరిస్థితులపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతగిరి, అరకు డుంబ్రిగూడ మండలాల్లో . ఆశ్రమ నిర్వాహకులతో ఎటిడబ్ల్యుఒలు కుమ్మక్కై విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారని ఆరోపించారు.ఆశ్రమాల్లో గిరిజన విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, హెల్త్ అసిస్టెంట్లు, వాచ్‌మెన్, వర్కర్లను నియమించాలని కోరారు. ఆయా సమస్యలపై గిరిజన సంక్షేమ డిప్యూట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు.

పెండింగ్ సమస్యల సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: రెవెన్యూ సంబంధిత భూసమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

అన్నదాత సుఖీభవ, ఆర్ఒఆర్, మ్యుటేషన్స్ పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరిచాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఆధార్ నంబర్‌లను సరిచేసి, వెంటనే అనుమతి కొరకు మండల వ్యవసాయ అధికారుల లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు.. కుటుంబ సభ్యుల మధ్య భూ తగాదాలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించే విధంగా మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. పరిష్కారం కాని సమస్యలను సివిల్ కోర్టు ద్వారా పరిష్కరించే దిశగా ముందుకు సాగాలన్నారు. చౌక ధరల దుకాణాలను నిరంతరం సందర్శించి, పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, పెండింగ్ ఇకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సరుకులు తీసుకోలేని వారికి వాటిని ఇంటి వద్దకే రేషన్ అందించే ఏర్పాటు చేయాలన్నారు. ఇ-స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని, చనిపోయిన సభ్యులను కార్డుల నుండి తొలగించి, అర్హత ఉన్నవారికి కొత్త కార్డులు మంజూరు చేయాలని సూచించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, కొత్త దరఖాస్తులకు అనుగుణంగా లేఅవుట్‌లు తయారుచేసి, మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. 23జిఒ ప్రకారం మూడు సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించడానికి అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రంతో బిఎల్ఒ యాప్‌లో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు తిరుమణి శ్రీ పూజ, స్మరణ్ రాజ్, శుభం నొక్వాల్, డిఆర్ఒ కె. పద్మలత, పాడేరు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

రచనలతో సామాజిక చైతన్యం

- భక్త కనకదాస జయంతిలో కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: తన రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని రగిలించిన మహోన్నత వ్యక్తి కనకదాసు అని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించిన భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కవిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా కనకదాస అందించిన సేవలను దేశం స్మరించుకుంటోందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తోందన్నారు. కనకదాసు అసలు పేరు తిమ్మప్ప నాయక్ అని, 1509లో కర్ణాటకలోని హావేరి జిల్లా, పిగ్గావ్ తాలూకాలోని బాడ గ్రామంలో గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించి, సైనికుడిగా వ్యవహరించారు. యుద్ధంలో గాయపడిన తర్వాత జీవితంలో ఆధ్యాత్మిక మార్పు పొందారన్నారు. తన పొలంలో దొరికిన బంగారు నిధిని దానధర్మాలు చేసి కనకదాసగా చిరస్మరణీయులయ్యారని కొనియాడారు. తన తత్వం, కీర్తనలతో సామాజిక రుగ్మతల నిర్మూలనకు కనకదాస చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. .

అనారోగ్య మరణాలకు ఆస్కారమివ్వొద్దు

- వైద్యులు, సిబ్బందికి డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ హెచ్చరిక

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: గ్రామాలలో చిన్నారులు, రోగులు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం అందక మరణిస్తే సహించేది లేదని వైద్యులు, సిబ్బందిని డిఎంహెచ్ఒ డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్ హెచ్చరించారు మంగళవారం మండలంలోని కిలగాడ పిహెచ్‌సిని ఆకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సి పరిధిలోని దారెల పంచాయతీ పరిధి కుమ్మరిపుట్టు, తలింబ, చీకుచింత గ్రామాలను సందర్శించి, నవజాతి శిశు మరణాలు సంభవించిన బాధిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి విచారణ జరిపారు. ఐదు మంది శిశువుల మరణానికి గల కారణాలను ప్రత్యేక వైద్య బృందం ద్వార సేకరించాలన్నారు. గ్రామ స్థాయిలోనే రోగులను గుర్తించి చికిత్సలు అందించాలని లేదా వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మెరుగైన వైద్యం కొరకుఉన్నతాసుపత్రులకు తరలించి చికిత్సలు అందించాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి, పర్యవేక్షక సిబ్బంది ఇంటింటి సందర్శనలు జరిపి, అంకితభావంతో విధులను నిర్వర్తించాలని సూచించారు. విధినిర్వహణలో ఆలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దారెల పంచాయతీ గ్రామాలలో వారం రోజుల పాటు వైద్య శిబిరాలను నిర్వహించాలని డాక్టర్లను ఆదేశించారు. కుమ్మరిపుట్టు, తలింబ, చీకుచింత గ్రామాలలో ఇంటింటికి వెళ్లి అందుబాటులో ఉన్న బాలింతలను, చిన్నారులను, గర్భిణులను కలిసి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కిలగాడ పిహెచ్‌సిలో అన్ని వార్డులను , ప్రసూతి గదిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ నాయక్

బర్త్ వెయిటింగ్ హోం వినియోగించుకోండి

ప్రసవానికి చేరువైన గర్భిణులను వారం రోజులు ముందుగానే పిహెచ్‌సిల్లోని బర్త్ వెయిటింగ్ హోంలో చేర్పించి, వారిని నిరంతర పర్యవేక్షణద్వారా సుఖప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని డిఎంహెచ్ఒ ఆదేశించారు. తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారంపై అవగాహన కలిపించాలన్నారు. . శీతాకాలంలో న్యుమోనియా వ్యాధి వ్యాప్తిచెందే అవకాశం ఉన్నందున అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు.. డయేరియా, టైఫాయిడ్ ఇతర వ్యాధులకు అత్యవసర మందులను, అన్నిరకాల వ్యాధినిరోధక వ్యాక్సిన్‌లు, సరిపడా మందులను రప్పించి అందుబాటులో ఉంచుకోవాలని ఫార్మసిస్ట్‌కు సూచించారు . లబ్బూరు పిహెచ్‌సి వైద్యాధికారి శ్యాం ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వరుస ఎన్‌కౌంటర్లతో..

వణుకుతున్న మన్యం

- తాజా ఘటనలో హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టులు మృతి
- కొద్ది రోజుల క్రితం రవి, అరుణక్క, అంజు, జగన్ కన్నుమూసింది ఇక్కడే..

ప్రజాశక్తి - రంపచోడవరం : వరుస ఎన్‌కౌంటర్లతో అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ చివురుటాకులా వణుకుతోంది. కాల్పుల మోతతో మన్యం గిరిజనులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గడిచిన పది నెలల కాలంలో రంపచోడవరం డివిజన్ అటవీ ప్రాంతంలో కీలకమైన మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. పెద్ద ఎత్తున మావోయిస్టులు చనిపోయారు. తాజాగా మంగళవారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత మడివి హిడ్మా, అతని భార్య రాజె సహా ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. వారి మృతదేహాలను రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతుల బంధువులకు అప్పగించనున్నారు. సుమారు పది నెలల క్రితం వై.రామవరం మండలం దుమ్మకొండ సమీపంలో జరిగిన కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు జగన్‌తో పాటు మావోయిస్టు రమేష్ మృతిచెందాడు. అది జరిగిన మరికొద్ది నెలలకే రంపచోడవరం మండలం కిట్టుపూరు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు రవి, అరుణక్క సహా మరొక మావోయిస్టు అంజు కన్నుమూసింది. తాజా ఘటనలో కన్నుమూసిన హిడ్మాకు గెరిల్లా పోరాట యోధునిగా పేరుంది. హిందీ, గోండు, తెలుగు, కోయ, బెంగాలీ వంటి భాషలపై ఆయనకు గట్టి పట్టుంది. దండకారణ్యంలో మావోయిస్టు కమిటీల్లో కీలక పాత్ర పోషించాడు. 2014 నుంచి 2024 వరకు జరిగిన సుమారు 25 నుండి 30 ఎదురు కాల్పులలో పాల్గొన్నారు. అతని భార్య రాజె మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతల్లో కొనసాగారు. వీరి మృతి తీవ్ర చర్చనీయాంశమైంది. మరికొంత మంది మావోయిస్టులు రంపచోడవరం ఏజెన్సీలోనే తలదాచుకుంటున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో వారు కూంబింగ్ చర్యలను ముమ్మరం చేశారు.



స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న పోలీసులు



హిడ్మా (ఫైల్ ఫొటో)

నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం

25 మంది డిశ్చార్జి, 15 మందికి కొనసాగుతున్న చికిత్స

ప్రజాశక్తి - కొయ్యూరు : ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన రాజేంద్రపాలెం వసతిగృహ విదార్థినుల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యాధికారి స్నేహలతారెడ్డి తెలిపారు. అస్వస్థతకు గురైన 40 మందికి గాను, నేటికి 25 మంది డిశ్చార్జి కాగా ఇంకా 15 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. డిశ్చార్జి అయిన విద్యార్థినులను ఇంకా అబ్జర్వేషన్‌లో ఉంచామని, శాంపిల్స్ వచ్చేంతవరకూ హాస్టళ్లో మంచినీళ్ల వారికి ఇవ్వవద్దని సూచించారు. వెంటనే హాస్టల్లో పరిసరాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులందరి ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ రాజేంద్రపాలెం వసతిగృహాన్ని మంగళవారం సందర్శించారు. పరిసరాలు పరిశుభ్రత లేదని సిబ్బంది ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ప్రతి విద్యార్థినితో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో పాడైన కూరగాయలను చూసి వార్డెన్, హెచ్‌ఎంలపై మండిపడ్డారు.



ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విద్యార్థినులు

అనంతరం రాజేంద్రపాలెం పిహెచ్‌సిలో విద్యార్థులను పరామర్శించి చికిత్స సరిగా అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు సక్రమంగా రావడంలేదని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరణ కోరగా విద్యార్థినులను ఆస్పత్రికి తీసుకువచ్చిన రోజు డాక్టర్ స్నేహలతారెడ్డి శిక్షణ నిమిత్తం వెళ్లారని, మరో వైద్యాధికారి జగదీష్ విధుల్లోనే ఉన్నారని తెలిపారు. అలా అయితే ఫిర్యాదులు ఎందుకు వస్తాయని ఆమె ప్రశ్నించారు. సిపిఎం జిల్లా సభ్యులు ఎస్ సూరిబాబు హెచ్‌ఎం, వార్డెన్‌లను విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వసతిగృహాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పర్యవేక్షణ లోపం లేకుండా అధికారులు ఏం చేస్తున్నారని, ఏజెన్సీలోని అన్ని హాస్టల్లో పరిస్థితి ఇలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలలను మౌలిక వసతులు కల్పించి విద్య వైద్యం సక్రమంగా అందేలా చూడాలని ఆయన హెచ్చరించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -ఎటపాక: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎటపాక సిఐ కన్నపు రాజు విద్యార్థులకు సూచించారు. ఎటపాక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై మంగళవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ కన్నపరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలు సరదా కోసం ప్రారంభించి, దానికి అలవాటు పడి తర్వాత బానిసగా మారతారన్నారు. కావున యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ , శక్తి యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక ఎస్సై అప్పలరాజు పాల్గొన్నారు.

సూరిబాబుకు సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: హిందీ భాషా ఐటిడిఏ ప్రచారక్ కన్వీనర్ శెట్టి సూరిబాబును ఘనంగా సన్మానించారు. విశాఖలో హిందీ మంచ్, హిందీ ప్రచారిణి సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో సూరిబాబు హిందీ ప్రచార సభ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, హిందీ మంచ్ వ్యవస్థాపకులు కోనే శ్రీధర్, హిందీ ప్రచారసభ రాష్ట్ర అధ్యక్షులు సి.ఎల్. నాయుడు శాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. హిందీ ప్రచార సభ నాలుగు రాష్ట్రాల సెంట్రల్ జనరల్ సెక్రెటరీ ఎస్ గైబువల్లి మాట్లాడుతూ జాతీయ భాష హిందీ ప్రచారానికి సూరిబాబు చేస్తున్న కృషిని ప్రశంసించారు. సదస్సులో హైకోర్టు న్యాయవాది జెవి నరసింహారెడ్డి, హిందీ మంచ్ విశాఖపట్నం జిల్లాశాఖ ప్రతినిధులు కట్టమూరి గోపాలరావు, బమ్మిడి రాజారావు పాల్గొన్నారు.

కట్టువీధిలో వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని బెన్నవరం పంచాయతీ కట్టువీధి గ్రామంలో జల జీవన్ నిధులతో నిర్మించిన కొత్త వాటర్ ట్యాంకును సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పూజారి నారాయణమూర్తి, మారిగెల చంటిబాబు, పూజారి నాగేశ్వరరావు, ఉల్లి రమణ, డిప్పల రాజు, ముప్పల సత్తిబాబు, ముప్పల రాంబాబు, గెమ్మెల దేవుడు బాబు, అశోక్, సతీష్ పాల్గొన్నారు.

వైసిపి నేతలకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని గుంట గన్నెల పంచాయతీ లక్క గ్రామానికి చెందిన వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు కె రామచందర్ తాత లైకోన్ (102) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేగం చాణక్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కె.హరి, పార్టీ మండల అధ్యక్షుడు పి పరశురాం ఇతర నాయకులు గ్రామాన్ని సందర్శించి లైకోన్ కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో అరకు నియోజకవర్గ బూత్ ఇన్‌ఛార్జి విజయ్, అరమ ఎంపిటిసి తమ్ నాథ్, రాందాస్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఇక్షిప్ ప్రాజెక్టుపై శిక్షణ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ ప్రోత్సాహంతో ఇక్షిప్ అనే ప్రాజెక్టుపై అల్లూరి జిల్లాలో ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్.వైఎస్ కుసుమ ఆధ్వర్యంలో డుంబ్రిగుడ పిహెచ్‌సి వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పిహెచ్‌సి వైద్యాధికారి పి రాంబాబు తెలిపారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్. కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యబృందం విడతల వారీగా 12 సిహెచ్‌సిల సేవలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. కొంతమంది టిబిలను తయారు చేసే వారితో జిల్లా వ్యాప్తంగా హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ సిబ్బందికి శిక్షణ అందిస్తున్నారన్నారు. హుకుంపేట, అరకు వ్యాలీ, చింతపల్లి, డుంబ్రిగుడ నాలుగు కేంద్రాల్లో ఒక్కొక్కచోట మూడు రోజుల శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జి వర్మ, కన్సల్టెంట్ దిలీప్ కుమార్, ఇక్షిప్ ప్రాజెక్ట్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్స్, సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకోం


ఉపాధి హామీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురాజు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ : గ్రామీణ పేద ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఉపాధి హామీ పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు విమర్శించారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కొత్త నిబంధనలతో లక్షలాదిమంది కూలీలు ఉపాధికి దూరమవుతున్నారన్నారు. వివిధ కారణాలతో దేశవ్యాప్తంగా 27 లక్షల మందిని డేటా బేస్ నుండి తొలగించారన్నారు. అందులో మన రాష్ట్రం నుండి అత్యధికంగా 15 లక్షల మందిని తొలగించారన్నారు. ఉపాధి పథకాన్ని పేదలకు దూరం చేసే ఎటువంటి చర్యలనైనా చూస్తూ ఊరుకోబోమన్నారు. పెండింగ్ ఉపాధి బకాయిలను చెల్లించడంతోపాటు అదనంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువుకు తీవ్ర అనారోగ్యం

పుట్టిన వెంటనే సకాలంలో టీకాలు వేయలేదని తల్లిదండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ శిశువు తీవ్ర అనారోగ్యానికి కారణమైందని చౌడుపల్లి పంచాయతీ వాముగడ్డ గ్రామానికి చెందిన బాధిత తల్లిదండ్రులు వంతల దణేష్, సత్యవతి ఆరోపించారు. పుట్టిన వెంటనే ఇవ్వాల్సిన బీసీజీ, ఓపీవీ, హెపటైటిస్-బి వంటి టీకాలను సకాలంలో, సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల ఇంజెక్షన్ ఇచ్చిన చోట వాపు ఏర్పడి, అనంతరం అది ఎముకకు ఇన్ఫెక్షన్‌కు దారితీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ప్రకారం... దణేష్, సత్యవతి దంపతులకు గత నెల 9న చింతపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మగశిశువు జన్మించాడు. జననం తర్వాత శిశువు ఆరోగ్యంగానే ఉన్నాడు. పుట్టినరోజు ఇవ్వాల్సిన టీకాలను ఆస్పత్రి సిబ్బంది తక్షణం వేయకపోవడంతో మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ అయ్యేటప్పుడు శిశువు కాలి వద్ద వాపు కనిపించింది. అది తగ్గకపోవడంతో మళ్లీ చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రైవేట్ ఆస్పత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్ చేయించుకోవాలని సిబ్బంది సూచించారు. నర్సీపట్నంలో ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయగా ఇంజెక్షన్ కారణంగా ఎముకకు ఇన్ఫెక్షన్ ఏర్పడిందని, రోజుకు రూ.4వేలు మేర ఖర్చు అవుతుందని, దాదాపు నెలరోజులు చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ నివేదికను తిరిగి చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యులకు చూపగా, ఇది ఇంజెక్షన్ వల్ల వచ్చిన ఇన్ఫెక్షన్ కాదని చెప్పి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం విషమించింది. కేజీహెచ్‌లో పిల్లల నిపుణులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఇన్ఫెక్షన్ తీవ్రత దృష్ట్యా భవిష్యత్తులో బిడ్డ నడవగలడో లేదో ఇప్పుడే చెప్పలేమని వైద్యులు తెలియజేశారు. నాలుగేళ్ల తర్వాత మరో శస్త్రచికిత్స అవసరం కావచ్చని చెప్పారు.

ఈ సంఘటనపై ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వైద్యుల నిర్లక్ష్యంతో జరిగిందని, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రిటికల్ పరిస్థితిలో ఉన్న శిశువుకు కేజీహెచ్‌లో అత్యుత్తమ వైద్యం అందించేందుకు ప్రభుత్వం తక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు : మత్తు పదార్థాల నిర్మూలన, ప్రజలు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండేందుకు ప్రజల్లో అవగాహన, చైతన్యం అవసరమని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మత్తు పదార్థాల వినియోగాన్ని సమూలంగా అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా`ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని, పాడేరు ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం విస్తత అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. చెడు వ్యసనాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. అనంతరం వైద్యవిద్యార్థులతో ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి, మత్తు వ్యతిరేక సందేశాన్ని వినిపించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత, డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ మాట్లాడారు కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, ఇతర విభాగాధిపతులు, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ నరసింహారావు, డాక్టర్ ఎరయ్య, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గంగరాజు, మెంబర్స్, ఈగల్ బృందం, నర్సింగ్ సిబ్బంది ఈగల్ టీం సిఐ, పోలీసులు పాల్గొన్నారు.

చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. యువత డ్రగ్స్‌కు ఆకర్షితులవుతున్న కారణాలు, అలవాటు పడితే ఎదురయ్యే మానసిక, శారీరక సమస్యలు, వాటి నుండి దూరంగా ఉండేందుకు పాటించాల్సిన నియమాలను సూచించారు. ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972ను విద్యార్థులతో పలికించారు. డ్రగ్స్‌రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ ఆర్ఎస్ఐ ఆర్.శ్రీరామమూర్తి, హెడ్ కానిస్టేబుల్ ఎలిషా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి ఇప్పటివరకు గ్రంథాలయంలో విద్యార్థులకు చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. పుస్తకాల ప్రదర్శన, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలతోపాటు కుర్చీ ఆటలు రన్నింగ్ మంచి ఆటలు పోటీలను విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. ఆటల పోటీల్లో విద్యార్థులు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రాజకీయనేతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొని, గ్రంథాలయ ఆవశ్యకతను విద్యార్థులు, పాఠకులకు వివరించారు. గ్రంథాలయంలో కథల పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉన్నాయని,వాటిని సద్వినియోగంచేసుకోవాలని తెలియజెప్పేందుకు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వివిధ పోటీల్లో విద్యార్థులకు ఈనెల 20న ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ తెలిపారు.కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత, సిబ్బంది ఎస్ సుబ్బారావు, కళాశాల అధ్యాపకులు కమల్, దివాకర్, ఎస్ సత్యమ పాల్గొన్నారు.

సందీప్‌రెడ్డికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-పాడేరు

పాడేరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళుతున్న పివి. సందీప్ రెడ్డి మంగళవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. మంగళవారం కాఫీ హౌస్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు సభలో జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ పాల్గొని, సందీప్ రెడ్డిని అభినందించి, అతని సేవలు, నిరాడంబరతను కొనియాడారు. కార్యక్రమంలో పాడేరు డివిజన్ అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

టిప్పర్‌ను ఢీకొట్టి బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని టిటింగ్‌వలస వద్ద ఆగి ఉన్న టిప్పర్ లారీని ఢీకొనడంతో బైకిస్ట్ మృతి చెందిన విషాద ఘటన హుకుంపేట మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు ఇచ్చిన వివరాలివి. రంగశీల పంచాయతీ సిమిలిగూడ గ్రామానికి చెందిన చౌంపి అప్పలస్వామి (45) మంగళవారం సాయంత్రం సిమిలిగూడ నుంచి హుకుంపేట వైపు వెళుతుండగా, టిటింగ్‌వలస వద్ద రోడ్డుపక్కన నిలిపి ఉంచిన టిప్పర్ లారీని బైక్‌తో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. అప్పలస్వామి హుకుంపేటలోని సిపిఎం కాలనీలో కుటుంబంతో నివాసముంటూ, టిడిపి కార్యకర్తగా పనిచేస్తూ ఉండేవారు. ఆయన ఆకస్మిక మరణంతో టిడిపి శ్రేణులు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

శ్రీ మోదమాంబ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో మోదమాంబ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం పాడేరులో నిర్వహించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.ప్రభాకర్‌రావు, ఎ.నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా డి. అయ్యప్పరెడ్డి, కోశాధికారిగా బి అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా పి వీరబాబు, వివిఎన్ చైతన్య, కార్యదర్శులుగా టి.నాగరాజు, కె.రాజుబాబు సంయుక్త కార్యదర్శిగా బి చలపతి, ఎస్ రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు..

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -అనంతగిరి : గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి పి.నారాయణమూర్తి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం పారిశధ్య కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, గ్రామాల్లో మౌలిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. చెత్తసేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యదర్శిదేనన్నారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు, ఎంపిడిఒ ప్రభాకరరావు, సిబ్బంది నరసింహారావు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ గౌతమ్, సచివాలయ సెక్రటరీదేవా, సిబ్బంది సునీత, శేఖర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ చివుకుచింత, డి కుమ్మరిపుట్టు, తలింబ గ్రామాలలో మంగళవారం తహశీల్దార్ భాస్కర అప్పారావు సందర్శించారు. ఇటీవల ఆరు నవజాత శిశు మరణాలపై ఆయా గ్రామాలలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ నవజాత శిశు మరణాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. శిశు మరణాలు జరగకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని పర్యవేక్షణలో ఉంచుతామని అన్నారు. ఎంఆర్ఐ కె.భాస్కరరావు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బిసి హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జి మాడుగుల : మండల కేంద్రంలో ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలలో208 మంది విద్యార్థులుండగా, వారికి వసతిసౌకర్యం కల్పనకు దీన్ని నిర్మిస్తున్నట్లు హెచ్ఎం ఎస్.నాగరాజు తెలిపారు. హాస్టల్ ఏర్పాటుకు పాఠశాల చైర్మన్ లకే రామకృష్ణ చొరవ చూపడంతో నిధులు మంజూరయ్యారన్నార కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపిటిసి మత్స్యరాస విజయ కుమారి, మాజీ ఎంపిపి మత్స్యరాస వెంకట గంగరాజు, మత్స్యరాస రామరాజు, టిడిపి పంచాయతీ ప్రెసిడెంట్ కెవిఎస్ఎస్ వరప్రసాద్, మత్స్యరాస నారాయణరాజు, గణేష్ మాస్టర్, పీసా కమిటీ బోనంగి సూరి పడాల్, కిముడు మణికంఠ, అడపా బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వెంకటరెడ్డి మృతికి పలువురు నివాళి

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని జీడిగుప్ప పంచాయతీ జీడిగుప్ప సిపిఎం శాఖ సభ్యుడు కనుగుల వెంకటరెడ్డి (50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా సభ్యులు సోయం చినబాబు, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకట్ రెడ్డి పార్టీలో చురుగ్గా పనిచేసేవారని అన్నారు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. వెంకటరెడ్డి స్ఫూర్తితో ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కల్లేపల్లి ఖాదర్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి వెంకటలక్ష్మి

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లో పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు సమైక్యంగా కృషి చేయాలని ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ తరగతులు ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎంపిపి వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు స్థానిక సర్పంచులతో కార్యదర్శులు కలిసి గ్రామ అభివద్ధికి తోడ్పడాలని సూచించారు.తాగునీటి పథకాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు పంచాయతీల చెందిన సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కొయ్యూరు: ఈ నెల 29వ తేదీన కొయ్యూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ ప్రసాదరావు తెలిపారు. ఎంపిపి బడుగు రమేష్ అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండలం లోని ప్రజాప్రతినిధులు అంతా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కుంపటిలో దుప్పటి పడి మంటలు చెలరేగిన ఘటనలో ఒక వృద్ధుడు గాయపడిన సంఘటన డి.మల్లవరంలో చోటు చేసుకుంది. డి.మల్లవరం శివారు పొలాల్లో కోర్రు బోడయ్య పొలాలకు కాపలాగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి చలి నుంచి ఉపశమనం కోసం మంచం కింద నిప్పుల కుంపటి పెట్టుకున్నాడు. ప్రమాదవశాత్తూ దుప్పటి నిప్పుల్లో పడి మంటలు చెలరేగాయి. దీంతో కొద్దిగా గాయపడ్డాడు. బోడయ్యను రాజఒమ్మంగి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బాధ్యతాయుత పాలనతో వన్నె తేవాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి


పదవీ బాధ్యతలు చేపట్టిన వారికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యేశిరీషాదేవి

దేవీపట్నం-ప్రజాశక్తి: బాధ్యతాయుత పాలనతో పార్టీకి వన్నె తేవాలని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి సూచించారు. స్థానిక ఇందుకూరు గ్రామంలో మంగళవారం మండల పార్టీ, అనుబంధ సంఘాలు ఇందుకూరిపేట సొసైటీ చైర్మన్, పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు అధ్యక్షతన, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ సౌజన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలస్థాయిలో ఉన్న కమిటి ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కాని పక్షంలో తన వద్దకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వారికి సన్మానించి అభినందనలు తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన మాగపు బాబురావు, కోండ్ల చినకొండారెడ్డిలను గండి పోచమ్మతల్లి ఆలయ కమిటి చైర్మన్ మలుగుల శ్రీనివాస్‌రెడ్డిని పాలక మండలి సభ్యులను ఘనంగా సత్కరించారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కీర్తి గంగాధర్, మండల తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్ కుమార్‌ను సన్మానించారు. అనుబంధ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత, ఎపిఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, రాష్ట్ర నూర్ భాష కార్పొరేషన్ డైరెక్టర్ షేక్‌సుభానీ, రాష్ట్ర రైతుఅధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, ఎఎంసి చైర్మన్ లోతా లక్షణరావు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మరిశెట్ల వెంకటేశ్వరరావు (బుజ్జి), జనసేన మండల పార్టీ అధ్యక్షులు శారపు రాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు

చలికి వణుకుతున్న మన్యవాసులు

జి.మాడుగులలో 7.4 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదు


ఉదయం 9 గంటలవుతున్నా లైట్ల వెలుగుతో వెళుతున్న బస్సులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మన్యంలోకొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. జనం ఉన్ని దుస్తులు ధరిస్తూ, చలి మంటలు కాగుతూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు. అయితే చలి నేపథ్యంలో ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కమ్మేస్తోంది. వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తుండగా, తాజా వాతావరణానికి ప్రకృతి అందాలు మరింత సుందరంగా దర్శనమిస్తుండడంతో పర్యాటకులు పరవశించిపోతున్నారు. ఏజెన్సీలో మంగళవారం జి.మాడుగులలో 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, ముంచింగిపుట్టులో 8.7, పెదబయలులో 10.9, అరకులోయలో 7.6, డుంబ్రిగుడలో 8.7, పాడేరులో 9.8, హుకుంపేటలో 10.0, అనంతగిరిలో 11.6 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న పీసా కమిటీ, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీలోని అన్ని గ్రామాలలో 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ పీసా క్లస్టర్ ఉపాధ్యక్షులు కిల్లో నారాయణ, కార్యదర్శి కిలో పద్మనాభం. ముంచంగిపుట్టు పీసా సభ్యులు పూజారి సుబ్బారావు , కించాయిపుట్టు పీసా క్లస్టర్ ఉపాధ్యక్షులు రొబ్బ పద్మనాభం, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక పంచాయతీ సెక్రెటరీ సింహాచలానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగాఎంపిడిఒను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యతల వారీగా పంచాయతీలోనీ అన్ని గ్రామాల్లో మంచినీరు, సిసి రోడ్లు, జంగిల్ క్లియరెన్స్, పారిశుధ్యం వంటి పనులకు కేటాయించాలని కోరారు. అన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని కోరారు. పంచాయితీ పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వార్డు మెంబర్లు విధిగా ప్రతి గ్రామసభకు హాజరయ్యి తీర్మానాలు చేసి అభివృద్ధికి తోడ్పడాలన్నారు.


పిల్లలతో మాట్లాడుతున్న జస్వీర్‌సింగ్

నెల్లిపూడి భవిత కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర డిప్యూటీ సెక్రటరీ

ప్రజాశక్తి - గంగవరం: నెల్లిపూడి భవిత కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ జస్వీర్ సింగ్ మంగళవారం సందర్శించారు. కేంద్రంలో ప్రత్యేక అవసరాలు పిల్లల పొందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలకు రోజువారీ అందించే సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిశీలించి అక్కడ పిల్లలు పొందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్, ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒ లక్ష్మణరావు, ఎంఇఒ 2 మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో నీతి అయోగ్ కార్యక్రమాలపై గంగవరం, మారేడుమిల్లి, వై.రామవరం ఎంపిడిఒలు నీతి అయోగ్ ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని సింగ్ నిర్వహించారు.


డిసిసిబి చైర్మన్ తో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ కేశవ్

గోల్డ్‌లోన్ సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజఒమ్మంగి సొసైటీలో గోల్డ్‌లోన్ సదుపాయం కల్పించాలని రాజఒమ్మంగి సొసైటీ అధ్యక్షులు ముప్పున కేశవ్ ఉమ్మడి తూర్పుగోదావరి డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామిని కోరారు. మంగళవారం కాకినాడలో రామస్వామిని కలిసి రాజవొమ్మంగి సొసైటీ కార్యాలయం నుంచి రైతులు బంగారం తాకట్టుపై అప్పులు తీసుకునే సదుపాయం కల్పించాలని, దానికి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. చైర్మన్ రామస్వామి స్పందిస్తూ త్వరలోనే గోల్డ్ లోన్ సదుపాయం కల్పించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు కేశవ్ తెలిపారు..

23న గిరిజన ఉపాధ్యాయ సంఘ సమావేశం

ప్రజాశక్తి -పాడేరు: ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు పాడేరు, తలారి సింగి ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేగం సూర్యనారాయణ జి శేషగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రస్తుత జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమర్పించిన నివేదికపై చర్చ ఉంటుందన్నారు. అనంతరం అల్లూరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఉంటుందని వెల్లడించారు.

కావున పాడేరు ఐటిడిఎ పరిధిలోని జన సంక్షేమ ఆశ్రమ, జిపిఎస్ పాఠశాలల్లోని అన్ని కేడర్ల ఉపాధ్యాయులు పాల్గొని నూతన జిల్లా శాఖను ఏర్పాటుకు, ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి గిరిజన సంక్షేమశాఖలోని ఉపాధ్యాయులంతా సహకరించాలని రాష్ట్ర శాఖ తరపున కోరారు. జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర సంఘ బాధ్యులు జివివి.ప్రసాద్, గంగాభవాని, వి.అర్జున్ వ్యవహరిస్తారని తెలిపారు.